విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 14 మే 2025 8 పేజీలు

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి
- 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఏపీ చైర్మన్ లంకా దినకర్‌బాబు

విశాలాంధ్ర – బాపట్ల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఏపీ చైర్మన్ లంకా దినకర్ బాబు అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు, పురోగతి, మౌలిక సదుపాయాల కల్పనలో 20 సూత్రాల కార్యక్రమాల అమలు తీరుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. వ్యవసాయ, పశుసంవర్ధక, డ్వామా, డిఆర్‌డిఏ, ఆర్డబ్ల్యూఎస్, పిఆర్, గృహ నిర్మాణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ, విద్యుత్, పబ్లిక్ హెల్త్, మెప్మా, పర్యాటక శాఖలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంతో అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించాలని వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం పనిచేస్తున్నారన్నారు. వారి ఆలోచనలకు తగినట్టుగా అధికారులంతా కలిసి పని చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా జీడిపి 11.2 శాతం ఉండగా, రానున్న ఏడాదిలో 15 శాతానికి చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. అభివృద్ధి వైపు బాపట్ల జిల్లా అడుగులు వేయాలంటే క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చాలా ముఖ్యమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు విస్తరణం పెరిగితే, రసాయనాల వినియోగం పూర్తిగా అరికట్టవచ్చన్నారు. సూర్యలంక, రామాపురం, మోటుపల్లి బీచ్‌లు అభివృద్ధి చెందితే స్వర్ణాంధ్ర ప్రదేశ్‌లో బాపట్ల జిల్లాను భాగస్వామ్యం చేయవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో 70 వేల ఎకరాలు ప్రస్తుతం సాగవుతుండగా రామన్న సంవత్సరంలో మరింత పెంచాలని చెప్పారు. పీఎం ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రీమియం సొమ్ము సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రస్తుతం 1.42 లక్షల మంది లబ్ధిదారులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, గడచిన ఆరేళ్లలో రూ. 800 కోట్లు రైతులకు అందాయన్నారు. గతేడాది 1,29,502 టన్నుల ఎరువులు కాగా, ఐదేళ్లలో 6,17,584 మెట్రిక్ టన్నుల రాయితీ ఎరువులు రైతులకు ఇచ్చామన్నారు. బిందు సేద్యంతో పంటల దిగుబడి గతేడాది 30 శాతం పెరిగిందన్నారు. తుంపర సేద్యంలో 3000 ఎకరాల విస్తీర్ణం లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఒంగోలు గిత్త ఎద్దుల జాతి వృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గడిచిన మూడేళ్లలో 9,418 కృత్రిమ పశుగర్భ దారుణతో పశువులు ఉత్పత్తి చేశామన్నారు. జిల్లాలో ప్రజల

మిగతా 2లో ...

20న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర – చీరాల : సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ తెలిపారు. ఈ నెల 20వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సన్నాహక సదస్సు పట్టణంలోని చీరాల సీనియర్ సిటిజన్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు దేవతోటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ మూడవసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను అమలులోకి తీసుకుని రావాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు.రాష్ట్రంలో మంచినీరు తాగడానికి దొరకడం లేదు కానీ మద్యం ప్రతిచోటా దొరుకుతున్నదన్నారుకార్మిక వర్గాలను అణచివేస్తూ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ

మిగతా 2లో ...

తుది శ్వాస వరకు జనసేనతోనే...

- కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు
- ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీకార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్

6లో

ఉపాధి కూలీలకు పరిహారంతో బకాయిలు చెల్లించాలి

4లో

20 ఏళ్లుగా కలగానే

టీ-5 కాలువ

- అలుపెరుగని రీతిలో రైతుల ఉద్యమం
- సీఎం వద్దకు పోస్ట్ కార్డులు
- గ్రామాల్లోనూ రైతుల్లో చైతన్యం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : కరువు కాటకాలకు పెట్టింది పేరు యర్రగొండపాలెం నియోజకవర్గం. ఈ ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టు ఓ వరప్రదాయిని. ప్రాజెక్టు ఎడమకాలువ (తీగలేరు) నుంచి ఈ నియోజకవర్గంలోని 66 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టు మొదటి విడత పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు మార్కాపురం పర్యటనలో భరోసా ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా, నియోజకవర్గం చివర్లో ఉన్న పుల్లలచెరువు మండలంలోని రైతులకు వెలిగొండ నీళ్లు వస్తాయనే భరోసా ఇచ్చేవారు కరవయ్యారు.

11,500 ఎకరాలకు సాగు :

ప్యాకేజీ-2లోని తీగలేరు కాలువ యర్రగొండపాలెం మండలం వీరాయపాలెం సమీపంలో 48.15కి.మీ వద్ద ముగుస్తుంది. ప్రాజెక్టు మొదటి అలైన్మెంట్ ప్రకారం ఇక్కడి నుంచి (48.15కి.మీ) మొదలయ్యే టీ5 కాలువ పుల్లల చెరువు సమీపంలోని చిన్నకండ్లేరు చెరువులో కలవాల్సి ఉంది. కాలువ కింద 11,500 ఎకరాల ఆయకట్టు కేటాయించారు. మల్లపాలెం సమీపంలో అటవీప్రాంతం మీదుగా కాలువ తవ్వాల్సిరావడంతో అప్పట్లో సాంకేతిక కారణాలు చూపించి అలైన్మెంట్ మార్చి నిర్మాణమే నిలిపేశారు. దాని ఆయకట్టును మాత్రం యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లో చూపించి చేతులు దులుపుకున్నారు. దీంతో తమకు అన్యాయం చేశారంటూ పుల్లలచెరువు మండల రైతులు 20 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నారు. దీని ప్రాధాన్యత దృష్ట్యా గత తెదేపా ప్రభుత్వం కాలువ నిర్మాణ సర్వే, అంచనా రూపొందించేందుకు నిధులు మంజూరు చేయగా డీపీఆర్ తయారు చేసిన ఓ ప్రైవేటు సంస్థ నివేదికను ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఇచ్చింది. అనంతరం ఎన్నికలు రావడంతో ప్రక్రియ నిలిచింది. 2019లో జరిగిన ఎన్నికల ప్రచారంలో వైకాపా నాయకుడు మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ టీ5 నిర్మాణంపై హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నిసార్లు అడిగినా పనులు కాకున్నా.. కాళ్లరిగేలా తిరిగి విసిగిపోయినా.. చివరకు కడుపు మండిన వ్యక్తిలో చైతన్యం వచ్చి పోరాటానికి సిద్ధమవుతారు. కొన్ని సార్లు అందరి మద్దతు దక్కి అది ఉద్యమానికి కూడా దారి తీస్తుంది. అలాంటిదే ఇప్పుడు రైతుల్లో వచ్చిన కదలిక సీఎం పేషిని కదిలించేందుకు పోస్టార్డులు రాయటం మొదలుపెట్టారు. తమప్రాంతానికి వెలిగొండ జలాలు వచ్చేందుకు తీగలేరు కాలువ కావాలని కోరుతున్న ప్రజలు మేము సైతం అంటూ కదలివచ్చి గ్రామ గ్రామాలకార్డులు రాసే కార్యక్రమం ఉధృతం చేస్తూ మొత్తానికి ఉద్యమం కోసం ఉత్తరం అనే ఆయుధాన్ని ఎంచుకొని తమ లక్ష్యం నెరవేరాలని కోరుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు :

నమ్మి ఓటేసిన వైకాపా ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడంతో కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వమైనా తమ చిరకాల కోరిక నెరవేర్చుతుందని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. కాలువ నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరుతూ నెల రోజులుగా ఈప్రాంత రైతులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్మికుల హక్కులను హరిస్తూ, వేతనాలు తగ్గిస్తూ, పనిగంటలు పెంచుతూ నిర్ణయాలు తీసు కుంటు దన్నారు. కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని, స్కీమ్ వర్కర్లకు, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, దీనిని ప్రశ్నించే హక్కు లేబర్ కోడ్ల వలన కోల్పోతామన్నారు. ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోడీ, నారా చంద్రబాబు నాయుడు కార్మికుల సంక్షేమం కోసం అనేక వాగ్దానాలు చేశారని, కానీ అమలు చేయలేదన్నారు. రైతు వ్యతిరేక దుష్ట చట్టాలను వక్రమార్గంలో తిరిగి ప్రవేశ పెట్టే యోచన కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించేందుకు నిరాకరిస్తున్నదన్నారు. కార్మికుల హక్కులను హరించడమే కాకుండా వారి హక్కుల పరిరక్షణ కోసం నినదించే అవకాశం లేకుండా చేస్తున్నదన్నారు. కార్మిక వర్గ హక్కులను పరిరక్షించి హక్కులను కాపాడు కోవడం కోసం, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరారు. మజుందార్ మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు 22 జాతీయ సమ్మెలు జరిగాయని, కానీ నేడు కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాపాడు కోవడం కోసం జరుగుతున్నదన్నారు. ఏఐటీయుసి సీనియర్ నాయకులు మేడా వెంకట్రావు మాట్లాడుతూ కార్మికులు, శ్రమజీవులు, రైతులు, సమస్యలపై ప్రజాస్వామ్య దేశంలో చర్చలు జరిపే సమయం రాజకీయ నాయకులకు లేదన్నారు. సీఐటీయు కార్యదర్శి ఎం.వసంతరావు మాట్లాడుతూ అందరం ఐకమత్యంగా కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసి పైడయ్య, మాచర్ల మోహన్ రావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, అచ్యుతుని బాబూరావు, మోహన్ కుమార్ ధర్మ, షేక్ జిలానీ, భారతి, శీలం రవికుమార్, దివి జయరాం, ఏఐటీయుసి, సిఐటీయు, ఐఎఫ్‌టీయు, సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

అవసరాలకు తగినట్టుగా పాల ఉత్పత్తి పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీపథకం అమలులో నిధులు దుర్వినియోగం గాకుండా అధికారులు పనిచేయాలని తెలిపారు. గతేడాదిలో 65 లక్షల పనిదినాలతో రూ.195 కోట్లు వినియోగించాలని లక్ష్యం కాగా, రూ.182 కోట్లు ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మెటీరియల్ కాంపోనెంట్‌లోనూ రూ.110 కోట్లు లక్ష్యం కాగా, రూ.90 కోట్లు వెచ్చించటమేమిటని ఆరా తీశారు. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం సహాయంతో 18 రకాల చేతి వృత్తుల వారికి నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. రూ.15 వేలు విలువైన టూల్ కిట్, వడ్డీ లేని బ్యాంకు రుణం కోసం జిల్లాలో 36,192 దరఖాస్తులు వచ్చాయన్నారు. 2,649 మందికి మాత్రమే శిక్షణ పూర్తి చేశామని అధికారులు చెప్పడంతో సమగ్ర వివరాలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పేదరిక నిర్మూలన, యువతకు ఉపాధి కల్పన, తాగునీరు అందించడమే లక్ష్యంతో అధికారులు పని చేయాలని మార్గ నిర్దేశం చేశారు. 20 సూత్రాలను అధికారులు పరిగణనలోకి తీసుకుని చక్కగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, సిపిఓ కె శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని పేర్నమిట్ట అంబేద్కర్ నగర్ చెందిన టిడిపి నాయకులు బలి కురువ శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకలు మంగళవారం ఒంగోలులోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ నందు జరిగాయి. ఈ వివాహ వేడుకలకు సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ హాజరై నూతన వధూవరులు ప్రణీత్ హర్ష స్వర్ణ దీపిక లను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వాసేపల్లి వెంకటేశ్వర రెడ్డి మద్దిపాడు వెలుగు ఎపిఎం. కాకుమాను సుబ్బారావు బల్లికర శ్రీనివాస రావు బత్తుల శ్రీనివాసరావు నూక తోటి ఈశ్వరరావు మిడసల మహేంద్ర నూక తోటి శీను కే హరి నందిగం కోటయ్య టి అనిల్ మండల టిడిపి ఎస్సీ సెల్ నాయకులు ఎస్ కొండలరావు తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.

వర్జీనియా, బర్లీ పొగాకు రైతులకు తీవ్ర నష్టం

- గిట్టుబాటు ధర అందించటంలో పొగాకుబోర్డు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- ఏపీ రైతు సంఘం నాయకుల వెల్లడి

విశాలాంధ్ర- ఒంగోలు : వర్జీనియా పొగాకు, బర్లీ పొగాకు కొనుగోలు చేయడంలో, రైతులను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పొగాకు బోర్డు విఫలమైనట్లు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వడ్డే హనుమారెడ్డి, కే వీరారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలై తీవ్ర మనోవేదంతో ఉన్నారు మనోవేదంతో ఉన్నారు. మినుము కంది పంటలు అధిక వర్షాలు వలన పంట నష్టపోయి అరకొరగా పండిన సరైన ధరలు లేక తీవ్రంగా నష్టపోయారు. సెనగలు కొనే దిక్కు లేదు. మిర్చి పంట వేసిన రైతులు తెగుళ్లతో సరైన దిగుబడిరాక ధరలు లేక ప్రత్యామ్నాయం లేక బర్లీ పొగాకు, వర్జీనియా పొగాకు రైతులు పండించారు. పొగాకు కంపెనీ ప్రతినిధులు బర్లి పొగాకుని క్వింటా 15000 రూపాయలకు తక్కువ కాకుండా ప్రోత్సహించి రైతుల చేత వేయించారు. తీరా పంట చేతికొచ్చి అమ్ముకో పోతే కంపెనీ ప్రజలు మొహం చాటేసి కొనుగోలు చేయలేదు. రైతులు తీవ్ర ఆందోళన చెంది రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే వ్యవసాయ శాఖ మంత్రి కంపెనీల చేత కొనుగోలు చేపిస్తామని చెప్పి హామీ ఇచ్చిన నేటికీ అరకొర గానే కొంటున్నారు. అప్పుల బాధలు తట్టుకోలేక ఇప్పటికే ఇద్దరు రైతులు మరణించారు మరొక రైతు ఆత్మహత్య ప్రయత్నం చేశారు. వర్జినియా పొగాకు కొనుగోలు ప్రారంభమై రెండు మాసాలైనా ఇప్పటికీ కొనుగోలు సక్రమంగా జరపట్లేదు. రోజుకు రెండు మూడు వందల బేళ్ల తిరస్కరణకు గురైతున్నాయి. పచ్చ మాడు పూర్తిగా కొనుగోలు చేయటం లేదు. పొగాకు కంపెనీలో ఆర్డర్లు లేవు ధరలు ఇంకా నిర్ణయించలేదని సాకు తోటి అరకొర రేట్లు వేస్తున్నారు. అన్నీ పొగాకు కంపెనీలు వేలంలో పాల్గొనాలి, మేలు రకం పొగాకు కి సరియైన ధరలు వేసినప్పటికీ బోర్డు అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వివరిస్తున్నారు. సమస్య తీవ్రతను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లిన తూతూ మంత్రంగా మీటింగ్ పెట్టి రైతులను గాని రైతు సంఘాలను గాని సమావేశానికి పిలవకుండా ప్లాట్ఫారం కమిటీ ప్రతినిధులను కూడా సమావేశంలో మాట్లాడనివ్వకుండా సమావేశం నిర్వహించారు. 2015 వ సంవత్సరంలో పొగాకు రైతులు తీవ్ర సంక్షోభంలో కొరికిపోయి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 18 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ సంవత్సరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 20 రూపాయలు కేజీకి బోనస్గా ఇచ్చి రైతులను ఆదుకున్న సంఘటన మన గుర్తున్నాయి. మార్క్ఫెడ్ ద్వారా పొగాకును కొనుగోలు జరిపించారు. ఈ సంవత్సరం కూడా అలాంటి పరిస్థితుల్లో ఉన్న కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ద్వారా కొనుగోలు జరిపించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి హనుమారెడ్డి, కే వీరారెడ్డి విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రైతాంగాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని దానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని అన్నారు. ఈనెల 14వ తేదీన గుంటూరులోని వ్యవసాయ శాఖ ఎ డి ని రైతు సంఘం నాయకులు, రైతులు కలవడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లా నుండి అధిక సంఖ్యలో రైతులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఆ సారు రూటే సపరేటు.!

- కరెంట్ విద్యుత్ ప్రభల నిర్వహకులతో డీఎస్పీ సమావేశం?
- మీడియాకు సమాచారం ఇవ్వని వైనం

విశాలాంధ్ర-పీసీపల్లి : మీడియా అంటే ఆయనకు అంత అలుసా.. మీడియాకు చెప్పకుండా విద్యుత్ ప్రభల నిర్వాహకులతో రహస్య మంతనాలు జరపాల్సిన అవసరం ఏంటి. డిఎస్పి వస్తే కనీసం మీడియాకు సమాచారం ఇవ్వరా? ఇటీవల కాలంలో ఆయన ఓ మొనార్కుడు వలే ప్రవర్తిస్తున్నాడు. అతనికి పైసాఏ పరమాత్మ. ఆయన రూటె సపరేట్ ప్రతి విషయంలో పైసా ఉంటే పని జరుగుతుందని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే పీసీపల్లి మండలం పెద అలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం గ్రామ శివారులో పాలేరు నది ఒడ్డున వెలసిన భాగీరధి గంగాభవాని తిరునాళ్ల ఈనెల 13 నుండి అంగరంగ వైభవంగా జరగనున్న విషయం తెలిసిందే. అయితే సోమవారం సాయంత్రం స్థానిక ఎస్సై విద్యుత్ ప్రభల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కనిగిరి డి.ఎస్.పి సాయి యశ్వంత్ ఈశ్వరన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఖాజావలి పాల్గొని ప్రభల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మీడియాను మాత్రం స్థానిక పోలీసులు దూరం పెట్టారు. ఇందులో అంతర్యం ఏమిటో ఎవరికీ అంత చిక్కటం లేదు గత 27 న ఇదే డిఎస్పి, సిఐ, ఎస్సై గంగమ్మ తల్లి గుడి దగ్గర అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే అప్పుడు మీడియాకు సమాచారం ఇచ్చిన స్థానిక పోలీసులు సోమవారం రాత్రి అదే ప్రాంగణంలో విద్యుత్ ప్రభల నిర్వహకులతో రహస్య మంతనాలు జరిపి మీడియా ఎలాంటి ఇవ్వలేదు మీడియాకు సమాచారం ఇస్తే 50 వేల రూపాయల ముడుపుల విషయం ప్రశ్నిస్తారని సమాచారం ఇవ్వనట్లు తెలుస్తోంది అయితే ఏది ఏమైనా నిర్వాహకులు ఏర్పాటు చేసే విద్యుత్ ప్రభకు పర్మిషన్ పొందేందుకు ఒక్కో ప్రభకు రూ 30 వేల నుంచి 50 వేల రూపాయల వరకు స్థానిక పోలీసులు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం పలుపత్రికలలో ప్రచురించిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేసిచూడాల్సిందే.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-పామూరు : ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్స్ బాలబాలికల బాస్కెట్బాల్ క్రీడాకారులకు ప్రకాశం జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి. రవీంద్ర క్రీడా దుస్తులు ను మంగళవారం బహుకరించారు. ఈ జట్లకు స్థానిక సెయింట్ మార్ప్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ గ్రౌండ్ నందు మే 7వ తేదీ నుండి. 13వ తేదీ వరకు శిక్షణ శిబిరము కోచ్. ప్రసాద్ ఆధ్వర్యంలో. జరిగినది. త్వరలో ఈ జట్టు చిత్తూరులో జరుగు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్‌లో పాల్గొంటాయి. ఈ శిక్షణ శిబిరానికి. భోజన వసతి. సెయింట్ మార్ప్. కరస్పాండెంట్ ముప్పారపు జయ కుమార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయ కుమార్ మాట్లాడుతూ. బాల బాలికలు ఈ పోటీలలో. పాల్గొని క్రీడలలో రాణించి ప్రకాశం జిల్లాకు. మంచి పేరు తీసుకురావాలని. కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్. కార్యదర్శి. తొట్టెంపూడి సుబ్బారావు. అసోసియేషన్. మెంబర్. సయ్యద్ జిలాని భాష, మరియు. పాఠశాల ఉపాధ్యాయిని. ఉపాధ్యాయులు. పాల్గొన్నారు.

సాలమ్మ కుటుంబానికి రూ 8.25 లక్షల పరిహారం మంజూరు

విశాలాంధ్ర-ఒంగోలు : బేస్తవారిపేట పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న సత్తెనపల్లి సాలమ్మ ఇతర కులాలచే వేధించబడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో దళిత నేత నీలం నాగేంద్రరావు కృషితో జిల్లా కలెక్టర్ తమీమ్‌న్సారియా ఎనిమిది లక్షల పాతికవేల రూపాయలు రిలీఫ్ మంజూరు చేశారు. సత్తెనపల్లి సాలమ్మ భర్త సత్తనపల్లి రంగయ్య హోంగార్డుగా పని చేస్తూ మరణించిన తర్వాత ఆ పోస్టును సత్తెనపల్లి సల్మమ్మ బేస్తవారిపేట పోలీస్ స్టేషన్లో నిర్వహిస్తుంది. సత్తెనపల్లి సాలము స్వగ్రామం అర్ధవీడు మండలం బోగోలు గ్రామానికి చెందినది. హోంగార్డ్ నెంబర్ 32 నంబరుతో సత్తెనపల్లి సాలమ్మ బేస్తవారిపేట పోలీస్ స్టేషన్లో పని చేస్తూ తన ఇద్దరు కుమారులతో జీవిస్తుంది. ఈ క్రమంలో పెద్ద కుమారుడైన వినయ్ కాకినాడలో పోలీస్ కోచింగ్ తీసుకుంటూ తన సన్నిహితురాలైన మాదాసి వెంకట మౌనిక బలిజ కులానికి చెందిన అమ్మాయిని ప్రేమించిన నేపథ్యంలో వాళ్లిద్దరూ ఊరు వదిలి వెళ్ళిపోయారు. తీవ్రమైన ఒత్తిడితో అమ్మాయి తరఫు వారు వేధించడంతో సాలమ్మ తన కొడుకుని మరియు మౌనికను పిలిపించి మౌనికను వారి తల్లిదండ్రులకు అప్పచెప్పారు. మరలా కొంతకాలానికి వినయ్ మరియు మౌనిక ఇద్దరూ మరోసారి ఊరు వదిలిపెట్టి వెళ్ళిపోయారు. 2022 జూలై 21వ తారీఖున వెంకట మౌనిక బాబాయ్ మారుతి మరియు నలుగురు సాలమ్మ ఇంటి వద్దకు వచ్చి సాలమ్మను అసభ్యంగా బూతులు తిడుతూ భౌతిక దాడికి పాల్పడ్డారు. హోంగార్డుగా పనిచేస్తున్న దళిత మహిళా సాలమ్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదు. తన పోలీస్‌స్టేషన్లో కూడా తనకు న్యాయం జరగలేదని మానసిక వేదనతో ఆత్మహత్యకు పాల్పడింది. ఎట్టకేలకు మూడు సంవత్సరాల తర్వాత జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా 8. 25 లక్షల రిలీఫ్ సాలమ్మ కుమారులు ఇద్దరు నవీన్, వినాయ్‌లకు మంజూరు చేశారని దళిత హక్కుల పరిరక్షణ సమితి నీలం నాగేంద్రరావు తెలియజేశారు.

కార్యకర్తలకు అండగా చంద్రబాబు, లోకేష్

- కార్యకర్తలకు సంక్షేమ నిధి ఏర్పాటు
- టీడీపీ రాజకీయ పార్టీ కాదు... ఆత్మీయ కుటుంబం
- మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : కార్యకర్తల కష్టాల్లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేష్ అండగా నిలుస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కొండపి నియోజకవర్గం కామేపల్లి అగ్రహారానికి చెందిన టిడిపి కార్యకర్త తానికొండ వెంకటరావు కుటుంబ సభ్యులకు మంగళవారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి రూ.5 లక్షల కార్యకర్తల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్యకర్తల కష్టాల్లో చంద్రబాబు,లోకేశ్ అండగా నిలుస్తున్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేశాం.ఈ సంక్షేమ నిధి ద్వారా కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు వారి పిల్లలకు విద్యను అందిస్తున్నాం. పార్టీ కోసం ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి పనిచేసే కార్యకర్తలు టీడీపీ సొంతం. టీడీపీ రాజకీయ పార్టీ కాదు..ఓ ఆత్మీయ కుటుంబం.పార్టీలో ఎవరికి ఏ కష్టం వచ్చినా 70 లక్షల మంది కార్యకర్తలు అండగా ఉంటారు. కార్యకర్తలకు మంచి చేసే విషయంలో చంద్రబాబు, లోకేశ్ ఎప్పుడూ ముందే ఉంటారని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి అండగా నిలిచిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, డోలా బాల వీరాంజనేయస్వామికి టీడీపీ కార్యకర్త వెంకట్రావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

డీసీఎంఎస్ ఛైర్మన్‌గా శ్యామలా కాశిరెడ్డి నియామకం

హర్షం వ్యక్తం చేసిన బైరెడ్డి, దారపనేని

విశాలాంధ్ర-పామూరు రూరల్ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త, వెలిగండ్ల మండలంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తూ, తెలుగుదేశం పార్టీ విధేయుడుగా ఉంటూ, ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మా మిత్రుడు శ్యామల కాశి రెడ్డికి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీస్సులతో డిసిఎంఎస్ చైర్మన్ పదవి వరించడం పట్ల కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ ఛైర్మన్ పదవి రావటానికి సహకరించిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోల బాల వీరాంజనేయ స్వామి, జిల్లాలోని శాసన సభ్యులందరికీ బైరెడ్డి, దారపనేని కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు పంటల దిగుబడిపై అవగాహన

విశాలాంధ్ర-సి ఎస్ పురం : కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో భాగంగా గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లాలోని నల్లమోతువారి పాలెంలో నాలుగు నెలల పాటు శిక్షణ కార్యక్రమం జరిగింది. మంగళవారం ముగింపు కార్యక్రమం బాపట్ల జిల్లాలోని నల్లమోతువారి పాలెంలోని రైతు సేవా కేంద్రం వద్ద రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనను కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ విస్తరణ డాక్టర్ శివనారాయణ మాట్లాడుతూ విత్తనోత్పత్తి, పంటలు సాగు చేసే విధానం, పంటలకు తెగుళ్లు, సస్యరక్షణ చర్యలు, పంటల దిగుబడి ఏ విధంగా సాధించాలి వాటి గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ శిక్షణ కాలంలో నేర్చుకున్న మెలుకువలతో వ్యవసాయ రంగంలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు, కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్న గౌడ్, విద్యార్థిని విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

సీపీఐ ఇంచార్జ్ నాసరయ్య

విశాలాంధ్ర-కొనకనమిట్ల : గ్రామస్థాయిలో నుంచి సిపిఐ శాఖలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని మార్కాపురం సిపిఐ ఇన్చార్జి అందె నాసరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన కొనకనమిట్లలోని గుజ్జుల ఎల్లమందారెడ్డి స్మారక భవనంలో జరిగిన కొనకనమిట్ల సిపిఐ శాఖ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 100 సంవత్సరాల చరిత్ర గల కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతుందని గుర్తు చేశారు. గ్రామాలలో సిపిఐ శాఖలను పునరుద్ధరించాలని జూన్ నెల 4వ తేదీన మార్కాపురం నియోజకవర్గంలో జరిగే నియోజకవర్గ మహాసభలను ,జూన్ నెల 21 22 23వ తేదీల్లో దర్శిలో జరగనున్న సిపిఐజిల్లా 17వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులను ప్రోత్సహిస్తుందని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక పింఛన్ పథకం తప్ప ఏ ఒక్క పథకాన్ని అమలు చేయడంలో విఫలమైందన్నారు .ఈ సమావేశానికి అధ్యక్షులు వహించిన సిపిఐ నాయకులు పివి కొండయ్య మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన మండల కేంద్రమైన కొనకనమిట్లలో జరిగే మండల మహాసభను కూడా విజయవంతం చేయాలని కోరారు. అనంతరం శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కే కోటేశ్వరరావు, సిపిఐ సభ్యులు సిగినం వెంకటేశ్వర్లు, సిహెచ్ పెద్ద సిద్దయ్య, బీమాలకొండయ్య, పిచ్చయ్య, పుల్లమ్మ తిరుపతయ్య పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో కిశోర వికాసం

బాలల హక్కులపై అవగాహన, ఆటలు

విశాలాంధ్ర-మార్కాపురం : అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టులో సీడీపీఓ ఆదేశాల మేరకు కిశోర వికాసం సెషన్ -4 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మార్కాపురం పరిధిలోని అంగన్వాడి సెంటర్-45 (సాయిబాబా మందిర్ ఏరియా)లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో బాలికలకు బాలల హక్కులు, వారి రక్షణ, వేసవి సెలవుల్లో విద్యాభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ పరికరాల వాడకాన్ని తగ్గించి, పరిజ్ఞానం పెంచుకునే మార్గాలపై మేధస్సును పెంపొందించే చిట్కాలను వివరించారు. చదువు, నైపుణ్యం పెంపొందించే సృజనాత్మక కార్యకలాపాలపై ప్రోత్సాహం ఇవ్వడమేగాక ఆటలు, పాటలు, నృత్యాలతో పిల్లల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రమాదేవి, ఎమ్మెస్ కే నర్సదా, అంగన్వాడీ కార్యకర్త ఎం. జబీనా సుల్తానా, ఆయా వెంకటలక్ష్మి,ఆశ వర్కర్ స్, ఆర్ పి తదితరులు పాల్గొన్నారు.

అయ్యలూరివారి పల్లిలో సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండలంలోని అయ్యలూరి వారి పల్లి గ్రామంలో 18వ తేదీ నుండి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ఆ గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు పామూరు సియస్ పురం సీతారామపురం మండలాల స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు ప్రథమ బహుమతి 30,116, దాత పాలుగుళ్ల మోహన్ రెడ్డి, ద్వితీయ బహుమతి 20,116 ముత్యాల వెంకటేశ్వర్ రెడ్డి, తృతీయ బహుమతి 10,116 దాత భూమిరెడ్డి వెంకట రెడ్డి అందజేస్తున్నట్లు వారు తెలిపారు ఎంట్రీ ఫీజు 500 రూపాయలు చెల్లించి ఈనెల 17వ తేదీ సాయంత్రం లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు టెన్నిస్ బాల్‌తో మ్యాచ్ నిర్వహించబడినట్లు తెలిపారు క్రీడాకారులు ఎవరికిట్టు వారే తెచ్చుకోవాలని సూచించారు వివరములకు 7075906442, 9505085146, 6305534431, 9502959570 నంబర్లను సంప్రదించాలని కోరారు.

17న కొండపి మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-కొండపి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17న శనివారం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి బి రామాంజనేయులు మంగళవారం తెలిపారు. తమ శాఖకు సంబంధించి అన్ని వివరాలు తోటి సమావేశానికి హాజరు కావాలని సూచించారు. గ్రామాల సర్పంచులు ఎంపిటిసీలు సైతం హాజరై గ్రామాల్లో సమస్యలను వివరించాలని తెలిపారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారి తప్పనిసరిగా సమావేశానికి హాజరు వారిని సూచించారు.

ఉపాధి కూలీలకు పరిహారంతో బకాయిలు చెల్లించాలి

- ఏపీ వ్య.కా.స రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు
- గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపుమేరకు మంగళవారం ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ కు వినతిపత్రాన్ని సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గత మార్చి 25 నుండి ఇప్పటివరకు రావలసిన ఉపాధి హామీ కూలీల బకాయిలు పరిహారం తో కూడిన చెల్లింపులు చెల్లించాలని అన్నారు. ఇంకా ఎనిమిది వారాల పెండింగ్ వేతనాలు రావాల్సి ఉందని వివరించారు. ఉపాధి హామీలో చేసిన పనికి వేతనాలు చెల్లించడంలో చాలా జాప్యం జరుగుతున్నదని వాపోయారు. వేతనాలు రాకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారి కుటుంబాలను పోషించుకోవడం చాలా కష్టమవుతుందని వివరించారు. వ్యవసాయ కూలీలకు జీవించే హక్కును కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధి హామీ చట్టం పారదర్శకంగా అమలు చేయాలని, ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. ఈ చట్టం సమర్థవంతంగా అమలు చేయడం కోసం రాజకీయ నాయకుల జోక్యం పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యవసాయ కూలీలు జీవించడమే కష్టమైన ప్రస్తుత కాలంలో ఉపాధి హామీ చట్టం మరింత పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.మెటీరియల్ బిల్లు లలో కూలీలకు చెల్లించాల్సిన చెల్లింపు లు మస్టర్ లనే చెల్లించాలని అన్నారు.కూలీల పనులకు రాజకీయ జోక్యం ఉండకుండా అందుకీ పని కల్పించాలని డిమాండ్ చేశారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సయ్యద్ మౌలాలి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో మౌలిక వసతులు నీడ,ఫస్ట ఎయిడ్ బాక్స్ ,మంచి నీటి సౌకర్యం, సమ్మర్ అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్ యం.విజయ, జిల్లా కార్యదర్శులు జీపిరామారావు, గద్దల రవి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - తాళ్లూరు : జిల్లా ఏపీ మైనార్టీ కార్పొరేషన్ ఉత్తర్వుల మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరుకు అర్హులైన మైనార్టీ కులముల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న తాళ్లూరు ఎంపీడీఓ దార హనుమంత రావు తెలిపారు. తాళ్లూరు మండలంలో బొద్దికూరపాడు, తూర్పుగంగవరం, తాళ్లూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకుల పరిధిలో 14 యూనిట్లు మంజూరు కానున్నట్లు చెప్పారు. అందులో రూ.10 లక్షలు సబ్సిడీతో రూ.10 లక్షల బ్యాంకు రుణం వస్తుందని చెప్పారు. ఈనెల 25వ తేదీ లోపు ఆన్ లైన్‌లో ఓబిఎం ఎం ఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

వడగాలులపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రస్తుత వేసవిలో వడగాలులు వీస్తున్నందున ప్రజలను ఎలా రక్షించాలనే విషయాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో పి.సునీత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మీటింగులు ఏర్పాటు చేసి ప్రజలకు వడగాలు గురించి తెలియజేయాలన్నారు. పి ఫోర్ సర్వే పూర్తి చేశారని ఆ సర్వే వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. గ్రామాలలో తడి పొడి చెత్త కోసం పిడుబ్బుని షెడ్లు ఏర్పాటు చేశారని వాటి వివరాలు తెలియజేయాలన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర, స్వర్ణాంధ్ర వివరా లను రికార్డులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజనకు అర్హులైన రైతులు ఈనెల 20వ తేదీ లోపు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం 14 వేలు, కేంద్ర పీఎం కిసాన్ పథకంలో 6 వేలు మొత్తం 20 వేలు మూడో విడత రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. మే నెలలోపు రాష్ట్ర ప్రభుత్వం నగదు బ్యాంకుల్లో జమ చేస్తుంది అన్నారు. మండలంలో అర్హులైన వారు విధిగా తమ ఆధార్, భూముల వివరాలు, ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వేమూరు శ్రీ కీర్తి,పాల్గొన్నారు.

టీడీపీ శిక్షణ తరగతులకు తరలిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర-పామూరు : మంగళగిరిలోని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతులకు పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల నాయకులు పాల్గొన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ హాజరై రాష్ట్ర ముఖ్యమంత్రి నార చంద్రబాబు ఆదేశాల మేరకు! భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2047 విజన్ స్ఫూర్తితో స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దాలన్న సంకల్పం నెరవేరుటకు కార్యకర్తలుగా మనం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పామూరు మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర టిడిపి నాయకులు అడుసుమల్లి ప్రభాకర్ రావు, బొల్లా నరసింహారావు, పందిటి హరీష్, సోమిశెట్టి శ్రీనివాసులు,గుంటుపల్లి శ్రీను, యస్.డి అమీర్ బాబు, చుంచు కొండయ్య,ఇర్రి కోటిరెడ్డి, యస్. కె చిన్న హజరత్, పత్తు మస్తాన్ హాజరయ్యారు.

కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఈఓఆర్డీ పరిశీలన

విశాలాంధ్ర-పామూరు రూరల్ : బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పామూరు పట్టణంలోని శ్రీ శక్తి భవన్‌లో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం జి అరవింద రెడ్డి పరిశీలించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితముగా కుట్టు మిషన్ తో పాటు సర్టిఫికెట్‌ను ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

నేటి నుంచి పాలేటి గంగమ్మ తిరునాళ్లు

16న రాత్రి అలరించనున్న విద్యుత్ ప్రభలు

విశాలాంధ్ర-పీసీపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా పెదచెర్లోపల్లి మండలంలోని పెదఅలవలపాడు గ్రామపంచాయతీ పరిధిలో వెంగళాపురం గ్రామ సమీపంలో పాలేరు నది ఒడ్డున వెలసిన ప్రముఖ ప్రసిద్ధిగాంచిన భాగీరథి పాలేటి గంగమ్మ తల్లి తిరునాళ్ల నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మంగళవారం అంకురార్పణ, బుధవారం అలంకరణ, గురువారం ఉత్సవము, శుక్రవారం తిరునాళ్ల, శనివారం పొంగళ్ళు నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని పెదఅలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళ పురం గ్రామ సమీపంలో పాలేటి నది ఒడ్డున వెలిసిన గంగమ్మ తల్లి భక్తుల పాలిట కొంగు బంగారంగా కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. మంగళవారం నుండి గంగమ్మ తిరునాళ్ళు ప్రారంభం కానున్నాయి. ఏటా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. పాలేటి గంగమ్మ తిరునాళ్ళు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో భాగీరథి గంగమ్మ తల్లి తిరునాళ్లకు వస్తారు. ఈ సంవత్సరం అంతకుమించిన సంఖ్యలో భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆలయ చరిత్ర : పదమూడవ శతాబ్దానికి చెందిన పాలేటి గంగమ్మ యాదవులు కులదైవంగా పూజిస్తారు. కనిగిరి సీమలో ఏలిన కాటమరాజు తమ ఆరాధ్య దైవమైన శ్రీ కృష్ణుని పూజించేవాడు. కొంతకాలం తర్వాత గంగాభవాని ఎంతో ఆగ్రహించిన గంగమ్మ కాటమరాజు ప్రేమగా చూసుకునే ఆవును దాచి పెట్టింది. తన ప్రాణ సమానమైన ఆవు కనిపించకపోవడంతో మానసికంగా కుంగిపోతాడు. కాటమరాజు కలలో కనిపించిన గంగమ్మ తనను పూజించి ఆరాధిస్తే ఆవును ఇస్తానని చెప్పింది. దీంతో కాటమరాజు గంగమ్మ కొలువు నిర్వహించగా గర్భం నుండి ఆవు వెలుపలకు వస్తుంది. ఆ ప్రదేశంలో రాతిపై గంగా దేవిని ప్రతిష్టించి పూజించారు. 1236 ఏడాదిలో నది ఒడ్డున గంగమ్మ సన్నిధానంలో పంచలింగాల కొండ ఉత్తరం వైపున నెల్లూరు రాజు మనుమసిద్దికి, కాటమరాజుకు భీకర యుద్ధం జరిగినట్లు చరిత్ర చెబుతుంది. ఈ సంగ్రామంలో మనుమసిద్ది మంత్రి ఖడ్గతిక్కన యోధుడిగా చరిత్రలో నిలిచింది. అప్పటి నుండి ఆ ప్రాంతాన్ని ఎర్రగడ్డపాడుగా పిలుస్తున్నారు. నేటికీ రెవెన్యూ రికార్డుల్లో ఎర్రగడ్డ పాడుగా నమోదైఉంది. ఇంత ఘనమైన చరిత్ర ఉన్న పాలేటి గంగమ్మ తిరునాళ్లను గతేడాది ఎలక్షన్ కోడ్ ఉండడంతో వైభవంగా జరగకపోయినప్పటికీ ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు.

16న రాత్రికి అలరించనున్న తొమ్మిది విద్యుత్ ప్రభలు : భాగీరథి గంగమ్మ తల్లి తిరునాళ్లలో భాగంగా 16 శుక్రవారం రాత్రికి ఎన్నడూ లేని విధంగా తొమ్మిది విద్యుత్ ప్రభలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అందులో పోతవరం గ్రామానికి చెందిన రెండు తడిక ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. 110 అడుగుల ఎత్తు నిర్మించే ఈ తడికె ప్రభలు భక్తులను విశేషంగా ఆకట్టుకోవటంతో పాటు మరో ఏడు విద్యుత్ ప్రభల సైతం భక్తులకు వినోదాన్ని పంచేందుకు వివిధ గ్రామాలకు చెందిన నిర్వాహకులు సిద్ధం చేశారు. ఏది ఏమైనాప్పటికీ గత ఏడాదితో పోల్చుకుంటే ఈసారి భక్తులు అధికంగా వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : పిల్లలు అభివృద్ధి చెందే క్రమంలో సకాలంలో టీకాలు వేయించాలని వైద్యాధికారులు సిహెచ్ ప్రవీణ్ కుమార్, బి మధు శంకర్‌లు అన్నారు. మండలంలోని మారళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆషాఢే సందర్భంగా సిబ్బంది, ఆషాకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా పిల్లలు అభివృద్ధి చెందే క్రమంలో టీకాలు చాలా ముఖ్య పాత్ర పోషిస్తాయి అన్నారు. ఐదు సంవత్సరాలకు వేసే డిపిటి, 10 సంవత్సరాలకు డిటి, 16 సంవత్సరాలకు వేసే డిటి, తప్పని సరిగా వేయించాలన్నారు. అదేవిధంగా పిల్లలకు 45 రోజులకు, 9 నెలల నుండి సంవత్సరం వరకు, వేసే టీ కాలనీ ప్రాముఖ్య తను ప్రతి తల్లిదండ్రులకు కూడా వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి వెంకటరావు, కే ఏ రాజు, సిహెచ్ నాగేశ్వరరావు, ఏ అంజమ్మ, ఏఎన్ఎంలు, ఆషాలు, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ఛైర్మన్‌కి సన్మానం

విశాలాంధ్ర- వెలిగండ్ల: ప్రకాశం జిల్లా డిసిఎంఎస్ చైర్మన్‌గా శ్యామల కాశిరెడ్డిని వెలిగండ్ల మండల టిడిపి అధికార ప్రతినిధి గంజి రాజశేఖర్ రెడ్డి మంగళవారం తెలుగుదేశం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగండ్ల ప్రాంతం అత్యంత వెనుకబడిన అయినప్పటికీ ఈ ప్రాంతం నుండి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్గా నిర్మించడం పట్ల పార్టీ అధినాయకత్వానికి కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మా మండల వాసికి జిల్లా పదవి ఇవ్వడం పట్ల హర్షం తెలిపారు.

చెరుకూరి శ్రీను మృతికి సంతాపం

విశాలాంధ్ర-దర్శి : దర్శి ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్లో కాంట్రాక్ట్ ఉద్యోగ పనిచేస్తూ ఏఐటీయూసీ కార్మిక సంఘంలో కీలకంగా పనిచేసి న చెరుకూరి శ్రీను మృతి చెందడం జరిగింది. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్ బాబు మాట్లాడుతూ చెరుకూరి శ్రీను ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్లో పనిచేస్తూ ఏఐటీయూసీలో అంకితభావంతో కార్మికుల పట్ల వారి సమస్యల పట్ల మాట్లాడే వారిని ఆయన తెలిపారు. చెరుకూరి శ్రీను మృతి ఏఐటీయూసీకి లోటని ఆయన అన్నారు. చెరుకూరి శ్రీను మృతదేహంపై ఏఐటీయూసీ జెండాను ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే.హనుమంతరావు, ఆర్డబ్ల్యూఎస్ జిల్లా కార్యదర్శి సింగరకొండ శ్రీను ఏఐటీయూసీ జెండా కప్పి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్ కరుణానిధి, బికేయంయు నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ నాయకులు విజయ్, ఆరునూరి బాబు, ఖాసీం కార్మికులు పాల్గొన్నారు.

ఎస్‌వికేపీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించాలి

విశాలాంధ్ర-మార్కాపురం : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళాశాల (ఎస్ వికెపి) సంస్థను వ్యాపార దృక్పథంతో ప్రైవేటు కళాశాలలకు లీజుకు ఇవ్వడాన్ని నిరసిస్తూ వెంటనే యాజమాన్యం కళాశాలలో2025-26 విద్యా సంవత్సరం కొరకు అడ్మిషన్స్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఆదరణ

విశాలాంధ్ర - తాళ్లూరు : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తుందని తాళ్లూరు మండల వ్యవసాయాధికారి ప్రసాద రావు అన్నారు. నాగంబొట్ల పాలెంలో మంగళ వారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు వస్తూ నూతన హైబ్రిడ్ రకాలు అందుబాటులోనికి వచ్చాయని అన్నారు. మితి మీరిన రసాయనిక వాడకంతో దిగుబడులతో పాటు మార్కెట్లో గిరాకీ తగ్గుతుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని పెట్టుబడి తగ్గటంతో పాటు మంచి దిగుబడులు, ఉత్పత్తులకు డిమాండ్ ఉంటుందని చెప్పారు. 2025 ఖరీఫ్ సాగుకు మరింత మంచి రైతులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 25 రకాల విత్తనాల కిట్స్ ప్రీ మాన్ సూన్ సోయింగ్ కిట్లును కొనుగోలు చేసి తొలకరిలో విత్తు కోవాలని కోరారు. రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి సాగు చేసిన రైతులను సన్మానించారు. ప్రకృతి సాగు ఇన్చార్జి పి నరసింహులు, ఎంపీఈఓ దయా సాగర్, ఐసిఆర్పీలు వాణి కోటి రత్నం, అనంత లక్ష్మి , మౌనిక, పల్లవిలు పాల్గొన్నారు.

బాలల హక్కులపై బాధ్యతగా ఉండాలి

విశాలాంధ్ర-సంతమాగులూరు : భారత రాజ్యాంగం బాలలకు కల్పించిన హక్కులు, వారి రక్షణ కోసం, పోక్సో చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సూపర్ వైజర్ జి.ప్రమీల చెప్పారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులను ఏల్చూరు మెయిన్-1 అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ప్రమీల మాట్లాడుతూ బాలలకు సమాజంలో సమానత్వం, స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందన్నారు. బడిలో ఉండాల్సిన చిన్నారులను పనుల్లో పెట్టడం, వెట్టి చాకిరి చేయిస్తే నేరంగా పరిగణించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా చిన్న పిల్లలపై అఘాయిత్యానికి పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ విషయంలో ఎక్కడైనా, ఎప్పుడైనా పిల్లల పై బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 181, 112లకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జె.పద్మ, ఎస్కే మస్తాన్ బి షాకిరూన్, ఎస్. చిన్నమ్మ, పీవీ దుర్గ, డి.బోడెమ్మ, మహిళా పోలీసులు మహాలక్ష్మి, అమీన్, సుమన పాల్గొన్నారు.

రైతులకు సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన

విశాలాంధ్ర-యద్దనపూడి : మండలంలోని అనంతవరం, యనమదల గ్రామాలలో రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు, జారీచేయడం పై వ్యవ సాయ శాఖ అధికారి ఎన్ మేరమ్మ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు సీసీఆర్సీ కార్డు ఏవిధంగా పొందాలి, వాటి వలన రైతులకు ఉపయోగములు గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ద్వారా రాయితీ పై విత్తన ములు ఎరువులు, పంట నష్టపరిహారాలు సీసీఆర్సీ కార్డు ఉన్న కౌలు రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ, సింగ్ చంద్రశేఖర్, దొడ్డ అప్పారావు, దొడ్డమహి శ్రీనివాస్, ఏ ఈ ఓ ఆర్ మధుప్రియ, నిమ్మల సాంబశివరావు, పోపూరి సాంబశివరావు, కొరటాల వీరయ్య చౌదరి, అనంతవరం , యనమదల రైతులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

విశాలాంధ్ర-సంతమాగులూరు : ఆటల పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, అప్పుడే అందరి మన్ననలు పొందవచ్చని గ్రంథపాలకుడు బాదం విజయ భాస్కర్‌రెడ్డి పిల్లలకు సూచించారు. మండల కేంద్రం సంత మాగులూరు శాఖ లైబ్రరీలో వేసవి విజ్ఞాన శిబిరం 13వ రోజు మంగళవారం నిర్వహించారు. 17మంది బాలబాలికలు పాల్గొన్నారు. చదరంగం, క్యారంబోర్డు, లూడోఆటల్లో విద్యార్థులు తమ మేధోశక్తికి పదునుపెట్టి ప్రతిభను చాటారు. అనంతరం వివిధ రకాల పుస్తకాలు, పత్రికలలోని కథనాలను చదివించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో జరుగుతున్న శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాలంటీర్లకు సభ్యత్వ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి పట్టణంలోని జనసేన పార్టీ ఆఫీసులో క్రియాశీలక వాలంటీర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా మంగళగిరి సెంట్రల్ ఆఫీసు నుంచి ప్రత్యేక బృందం హాజరయ్యారు. జనసేన పార్టీ సభ్యత్వం నమోదు విషయంలో అందరూ సమష్టిగా కృషి చేశారని ప్రశంసించారు. అద్దంకి పరిధిలోని ఐదు మండలాల నుంచి మొత్తం 2450 సభ్యత్వాలు నమోదు కాగా, ఒక్క సంతమాగులూరు మండలం నుంచి వెయ్యి సభ్యత్వాలు చేసినట్లు తెలిపారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ పార్టీ బలోపేతానికి, అధిక సంఖ్యలో సభ్యత్వాలు చేసేందుకు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా జనసేన సభ్యత్వం పొందిన వారికి ప్రమాద బీమా కింద ప్రమాదవశాత్తూ మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున పార్టీ ఫండ్స్ నుంచి ఇవ్వనుందని పేర్కొన్నారు. క్షతగాత్రులకు అందించే సాయం రూ.50వేల నుంచి రూ.లక్షకు పెంచాలని, అలాగే హెల్త్ ఇన్సూరెన్స్ కూడా ఇందులో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వాలంటీర్లకు సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు గాదె రామాంజనేయులు, వెంకటేష్, బత్తుల చందు, నాయకులు పాలపోతు పూర్ణచంద్ర పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణ మంగళవారం తెలిపారు. సాగు దారు గుర్తింపు కార్డుల కొరకు మంగళవారం నుంచి మండలంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌలురైతులు గ్రామ సభలకు హాజరై తమ వివరాలు సమర్పించి కౌలు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కౌలు గుర్తింపు కార్డులు కలిగిన రైతులకు రాయితీ విత్తనాలు ఎరువులు, పంటల నష్టపరిహారం, ఈ క్రాప్ ఉన్న రైతులకు పంటలు అమ్ముకునేందుకు వెసులుబాటు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 21 వరకు గ్రామసభలలో కౌలు గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. అవకాశాన్ని కౌలురైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోశాలకు దాణా వితరణ

విశాలాంధ్ర-అద్దంకి : రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో పట్టణంలోని హరిహర గోశాలకు 12 బస్తాల దాణా అందించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికార్లు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, శేషారెడ్డి, ధర్మవరపు శ్రావణ్ కుమార్, గుళ్ళపల్లి సుబ్రహ్మణ్యం, గోశాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. రోటరీ మిత్రుల సౌజన్యముతో ప్రతి నెలా గోశాలకు దాణా ఏర్పాటు చేసి తమ వంతు సహాయం చేస్తున్నామని, సుబ్బారావు గోవులను బాగా పోషిస్తున్నాడని రోటరీ అధ్యక్షులు వీరయ్య పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర-రేపల్లె : పట్టణంలోని 25వ వార్డులో నివాసం ఉండే షేక్ జమీర్ భార్య షబానా (21) ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించటం లేదని షబానా అత్త గౌస్య ఇచ్చిన పిర్యాదు మేరకు మహిళా అదృశ్యం పట్టణ ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లిఖార్జునరావు తెలిపారు. వీరికి 2019లో వివాహం కాగా ఇద్దరు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. ఈనెల 10వ తేదీ రాత్రి సమయంలో షబానా తన పిల్లలను వదిలి వెళ్ళిపోయినట్లు ఎక్కడ వెతికినా కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు



విశాలాంధ్ర- పర్చూరు: తల్లిదండ్రులు బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని సిడిపిఓ జి.సుభద్ర తెలిపారు. కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా పర్చూరులోని తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మంగళవారం బాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ బాలికలకు రక్షణ, హక్కులపై అవగాహన ఉండాలని, ఫోక్సో చట్టం విస్తృతిని తెలుసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల ద్వారా జరిగే దుష్ప్రభావాలను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.దీపాదేవి, అన్నపూర్ణ, పాల్గొన్నారు.

రసాయన వ్యవసాయంతో అనర్థాలు

విశాలాంధ్ర-పర్చూరు: రైతులు రసాయన వ్యవసాయం సాగుచేయటం వలన అనర్థాలు ఉన్నాయని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభైరు మోహనరావు తెలిపారు. మండలంలోని నూతలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సమావేశం జరిగింది. ఆయన మాటాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని, కౌలు రైతులు కార్డులపై అవగాహన కలిగించారు. ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులు కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, సతీఫ్, నరసింహారావు, రత్నకుమారి, దావల్ సాహెబ్ లను దుశ్శావాలవాతో సత్కరించారు. మండల వ్యవసాయ అధికారి రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో బోడవాడలో గ్రామసభ జరిగింది. సమావేశంలో సర్పంచ్లు బాపూజీ, చిన్నయ్య, ఎల్2లు జి.శ్రీనివాసరావు, చందనాల రవితేజ, సిబ్బంది ఉన్నారు.

రేపల్లె బ్లడ్ బ్యాంక్‌ను పరిశీలించిన రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ దశరథ రామారావు

విశాలాంధ్ర-రేపల్లె : రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ యార్లగడ్డ దశరథ రామారావు మంగళవారం ఉదయం 11 గంటలకు రేపల్లె ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌ని సందర్శించి పనితీరు పరిశీలించి పలు సూచనలు చేశారు. రాబోయే కాలంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పూర్తి సహకారంతో నాట్కో ఫార్మా విరాళంతో కాంపోనెంట్స్ బ్లడ్ బ్యాంక్ చేయటానికి తమ వంతు సహాయ సహకారాలు తెలియజేశారు. రేపల్లె బ్లడ్ బ్యాంక్ పనితీరు బాగుందని ఇంకా బ్లడ్ డొనేషన్లు, ఇష్యులు పెంచుకోవాలని, రేపల్లె బ్లడ్ బ్యాంక్‌కు 10 కె.వి. సోలార్ ప్లాంట్‌ని గతంలో రామారావు విరాళంగా అందజేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ మెంబర్లు, రేపల్లె బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, కరీముల్లా, శ్రీనివాసరావు, కృష్ణ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొని విచ్చేసిన చైర్మన్ యార్లగడ్డ దశరథ రామారావును ఘనంగా సన్మానించి సత్కరించారు.

50 శాతం రాయితీతో రైతులకు పశువుల దాణా పంపిణీ

విశాలాంధ్ర- రేపల్లె : రేపల్లె పశు వైద్యశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ 50 శాతం రాయితీపై పశుదాణా పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అనగాని శివప్రసాద్ పాల్గొని పశు దానాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ రేపల్లె ఏరియా, అసిస్టెంట్ డైరెక్టర్ బి నాంచారయ్య, పట్టణ టిడిపి అధ్యక్షులు గోగినేని రామారావు, టిడిపి నాయకులు, గుర్రం మురహరి, కొలసాని రాము వెటర్నరీ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్లు, పాల్గొన్నారు.

పెరిగిపోతున్న ఎండలు, ఉక్కపోతతో ప్రజల అవస్థలు

విశాలాంధ్ర- రేపల్లె : మండుటెండలకు తోడు ఉక్క పోత అడపాదడప ఈదురు గాలులు, ఆకాశం మేఘావృతం వర్షాలతో ఉపశమనం పొందిన ప్రజలు గత నాలుగు రోజుల నుండి పెరిగిన ఉష్ణోగ్రతతో అల్లాడిపోతున్నారు. గత రెండు రోజులుగా రేపల్లె ప్రాంతంలో పలు మండలాలలో పట్టణాల్లో భానుడు ప్రతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోహిణి కార్తె ఇంకా 15 రోజులు ఉండగానే ఎండ తీవ్రత పెరిగింది. ఉదయం నుండి భానుడు భగభగ లాడుతూ ఉండడంతో మధ్యాహ్నవేళ వాతావరణంలో సెగలు కక్కుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితం కావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి ఇలాగే ఇంకా కొన్ని రోజులు ఎండల తీవ్రత ఎక్కువైతే వడదెబ్బకు ప్రజలు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. మధ్య మధ్యలో విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు.

మోటుపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

– కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : మోటుపల్లి ప్రాచీన ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తెస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మోటుపల్లి గ్రామం, మ్యూజియం నిర్మాణం, వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్ లోని వీక్షణ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. కాకతీయుల నాటి అభయ శాసనాలను తెలుగులో అనువదిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే పురావస్తు శాఖ పరిశోధకులు, శాసనాల పరిశోధకుల ద్వారా ఆ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. మూడు శాసనాలలోని తాత్పర్యం ప్రజలందరికీ అర్థమయ్యేలా సాధారణ తెలుగు భాషలోకి అనువదిస్తూ రాళ్లపై చెక్కిస్తున్నామన్నారు. ప్రాచీన వైభవం తెచ్చేలా ఆలయం అభివృద్ధి చేస్తామన్నారు. కోదండరామ దేవాలయానికి సమీపంలోని 5.8 ఎకరాల భూమిని ఆలయానికి కేటాయిస్తూ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయడం అయిందన్నారు. 100 ఎకరాల సొన భూమి విషయమై శాసనసభ్యులతో మాట్లాడి ఆ భూమిని ఏపీటీడీసీకి కేటాయించి, అందులో బయోడైవర్సిటీని అభివృద్ధి పరచాలని, అందులో ఎటువంటి కట్టడాలు కట్టకూడదని షరతులు విధిస్తామని తెలిపారు. కాకతీయులు, చోళ రాజుల నాటి శాసనాలు, పంచలోహాలను చిన్నగంజాంలోనే భద్రపరచడానికి మ్యూజియం నిర్మించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. మ్యూజియం నిర్మాణంపై పురావస్తు శాఖకు సమగ్ర నివేదికతతోపాటు లేఖ పంపాలని అధికారులను ఆదేశించారు. పురావస్తు శాఖ అధికారుల సహకారంతో మ్యూజియం ఏర్పాటుపై కమిటీలోని అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్ చెప్పారు. చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సూర్యప్రకాశరావు, చిన్నగంజాం తాసిల్దార్ ప్రభాకర్ రావు, మోటుపల్లి అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని వీరన్నపాలెం గ్రామానికి చెందిన ఉప్పుటూరి సాంబశివరావు ఆర్థిక సమస్యలతో ఇటీవల రైతు ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం మాజీ మంత్రి మెరుగు నాగార్జున, పర్చూరు వైసిపి ఇన్చార్జ్ మధుసూదన్ రెడ్డి, వైసీపీ నాయకులు సాంబశివరావు కుటుంబాన్ని పరామర్శించి వారిని ఓదార్చారు. వారికి ఆర్థిక సహాయం రూ. 50,000 అందించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ శివరాం ప్రసాద్, మాజీ జడ్పిటిసి భవనం శ్రీనివాస్ రెడ్డి, వైసీపీ నాయకులు గర్నెపూడి రవిచంద్ర, దాసరి వెంకట్రావు, ఉప్పలపాటి అనిల్, కోటా శ్రీనివాసరావు, పటాన్ కాలేషావలి, జెట్టి చంద్రం,ముప్పాళ్ళ రాఘవయ్య, కొల్లా శ్రీహరి, లంక శివ, పాలేరు వీరయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తూ పోటీ ప్రపంచానికి ధీటుగా విద్యాభ్యాసం అందిస్తున్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మరో ఘనత సాధించారు. మంగళవారం విడుదలైన సిబిఎస్ఈ పదవ తరగతి ఫలితాలలో పాఠశాల విద్యార్థులు 52 మందికి గాను 52 మంది(100) ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా నేహా కొక్కిలిగడ్డ 96.4 శాతం మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. నలుగురు బాలికలు, ముగ్గురు బాలురు 90 శాతం పైగా మార్కులు సాధించారు.టాప్ 3 లో ముగ్గురు అమ్మాయిలు 95 శాతం పైగా మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్టను పెంచారు. నేహా, మానస, వైష్ణవి, వీర వెంకట శ్రీరామ్, శివ స్కంద, ఐశ్వర్య హరిత్రామ్ 90 శాతం పైన మార్కులు సాధించారు. చైర్మన్ మాట్లాడుతూ మన ప్రాంతంలో ఉన్న విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీ వంటి శిక్షణ ఇచ్చేందుకు పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి ఎన్డీఏ, సిడిఎస్, ఏఎఫ్‌సిఏటి మొదలగు పోటీ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులయ్యేలా అకాడమిక్ ప్రోగ్రామ్ను మొదలు పెడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

తుది శ్వాస వరకు జనసేనతోనే...

- కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు
- ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్
- కంది రవిశంకర్ ఆధ్వర్యంలో రియాజ్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర -ఒంగోలు : తన తుది శ్వాస విడిచే వరకు జనసేన పార్టీలోనే కొనసాగుతారని ఆంధ్ర ప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్ పేర్కొన్నారు. స్థానిక రవిప్రియా మాల్ ఆవరణంలో మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ చైర్మన్ గా ఎంపికైన షేక్ రియాజ్ సన్మాన కార్యక్రమం రవి ప్రియ గ్రూప్స్ అధినేత, ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ తనను కార్పొరేషన్ చైర్మన్ చేసినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో పనిచేసిన ప్రతి ఒక్కరికి ఆలస్యంగా నైనా తగిన గుర్తింపు ఉంటుందని, అందుకు తానే పెద్ద ఉదాహరణ అని పేర్కొన్నారు. జనసేన పార్టీ స్థాపించిన నాటి నుండి ఇప్పటి వరకు పార్టీ లైన్ తప్పకుండా, పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పని చేస్తున్నానన్నారు. పార్టీలు మారే వ్యక్తి తాను కాదన్నారు. పవన్ కళ్యాణ్ ద్వారా జనసేన పార్టీ ద్వారా తనకు పెద్ద కుటుంబం వచ్చిందన్నారు.రవిప్రియా గ్రూప్స్ అతినేత, జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్ మాట్లాడుతూ రియాజ్ తనకు సోదరులతో సమాన మన్నారు. బాగా కష్టంకి పనిచేసే వ్యక్తి అన్నారు. అందువల్లే నేడు పార్టీ ద్వారా తగిన గుర్తింపు వచ్చిందన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తనవంతు సహాయసహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. మాజీ ఎంటి చైర్మన్ , టిడిపి నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు రియాజ్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రియాజ్ ను ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు రియాజ్ ను పూలదండలతో, దుశాలువాలతో, బొకేలతో, బహుమతులతో సత్కరించారు.

తానికొండ దయాబాబు మృతి పార్టీకి తీరని లోటు

- ఎంపీ తన్నెటి, ఎమ్మెల్యేలు వేగేశన, నక్కా ఆనందబాబు, బావుడా చైర్మన్ సలగల

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : టీడీపీ పార్టీ బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు అకస్మిక మృతి పార్టీకి తీరని లోటు అని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రర్మ, నక్కా ఆనంద్‌బాబు, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ పలువురు పార్టీ ప్రముఖులు కొనియాడారు. పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి దయాబాబు ఆకస్మిక మృతి చెందటంతో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. పార్టీలకతీతంగా దయాబాబు పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐదు దశాబ్దాల పాటు ప్రజా ఉద్యమకారుడిగా రాజకీయ నాయకుడిగా చేసిన సేవలు కొనియాడారు. భుజం భుజం కలిపి గజం గజం నడుస్తూ పార్టీ జెండాను రెపరెపలాడించాలని గంభీరమైన స్వరంతో కంచు వలె మోగే కంఠంతో తెలుగుదేశం పార్టీ కేడర్ ను ఉత్తేజంపజేసే మంచి వాక్చాతుర్యం కలిగిన దయాబాబు గొంతు మూగబోవటం కలిసివేసిందన్నారు. మాజీ క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేల్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,మాజీ కౌన్సిలర్ పేర్లి సునీల్, టీడీపీ పార్లమెంట్ యువత కార్యదర్శి అడే వంశీ, మందపాటి ఆంద్రేయ, షాలెంరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంటా అంజిబాబు, మాజీ కౌన్సిలర్ బక్కా రోశయ్య, దోనేపూడి దేవరాజ్ బాబూరావు, కుమార్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి, జనసేన నియోజకవర్గ నాయకులు విన్నకోట సురేష్ ,పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ జనసైనికులు కారుమూరి అంజినేష్, పసుపులేటి మహేష్, కామిశెట్టి సాయిబాబు, పెద్దినాగు, సంగీత యేసోబు, కంచర్లపల్లి నరేంద్ర తదితరులు నివాళులర్పించారు.

టీడీపీ బలోపేతానికి కృషి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : టీడీపీ పార్టీకి అండగా ఉండి ప్రతి టీడీపీ కార్యకర్త బోలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర ఎమ్మెల్యే విజయ్ కుమార్ తన కార్యాలయం మంగళవారం టిడిపి మండల పార్టీ అధ్యక్షుల్లు క్లస్టర్ ఇంచార్జిలతో సెక్రటరీల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు విజయ్ కుమార్ మాట్లాడుతూ నూతన మండల కమిటీ గ్రామ కమిటీ క్లస్టర్ యూనిట్ సెక్రటరీల కమిటీలను అదే విధంగా కె ఎస్ ఎస్‌లను కుడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడకా స్వాములు టిడిపి మండల పార్టీ అధ్యక్షుల్లు మద్దినేని హరిబాబు తెళ్ల మనోజ్ కుమార్ గొల్లపూడి సుబ్బారావు మండవ జయంత్ బాబు క్లస్టర్ ఇంచార్జిలు కాకర్ల లక్ష్మి వరప్రసాద్ దేవబత్తిన ప్రసాద్ రావి శ్రీనివాసరావు వివరం గోవింద్ మద్దినేని చైతన్య సెక్రటరీలు తాటి తోటి నరసింహరావు ముత్తనపల్లి రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంట సాగు హక్కు పత్రాలు తీసుకోవాలి

విశాలాంధ్ర-వేటపాలెం : మండల పరిధిలోని కొత్తపేట రైతు సేవ కేంద్రం మంగళవారం రైతులతో మండల వ్యవసాయ అధికారి ఐ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మట్టి నమూనా సేకరణ జరుగుతుందని రైతులందరూ మట్టి నమూనాలు తీసుకొని పరీక్ష చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవకి సంబంధించి డేటా ఎంట్రీ జరుగుతున్నందున రైతు సోదరులందరూ తప్పకుండా ఇందులో నమోదు చేయించుకోవాలని సూచించారు. పి.ఎం. కిసాన్ పథకం ఫార్మర్ ఎన్రోల్మెంట్ పై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అనుబంధంతో పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని కౌలు రైతులందరూ ఈ పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రం కచ్చితంగా తీసుకోవాలని తద్వారా వారికి పంట వేసినప్పుడు, అమ్ముకునేటప్పుడు ఈ పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి గోపికృష్ణ, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ నాగరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు శివ నాగ బాబు గ్రామ రైతు సోదరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పర్సనల్ అవార్డ్

విశాలాంధ్ర-వేటపాలెం : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ వేటపాలెం ఫిజికల్ డైరెక్టర్ అన్నం శ్రీనివాసరావుకు బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పర్సనల్ అవార్డ్ పొందినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.జగదీష్ బాబు మాట్లాడుతూ మే 10న జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ ఆధ్వర్యంలో జరిగిన యూనివర్సిటీ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్‌లో బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పర్సనల్ అవార్డ్ పొందినట్లు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో జేఎన్టీయూ కాకినాడ స్థాయిలో పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో బాలురు, బాలికల విభాగాల్లో, బాడీ బిల్డింగ్ బాలురు విభాగంలో క్రీడలు నిర్వహించడం జరిగింది. అలాగే వివిధ కళాశాలలో జరిగిన పోటీలలో కళాశాల జట్లు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి విన్నర్స్‌గా నిలిచారు. అలాగే ఎంబీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి సయ్యద్ ఖాజావలి ఆల్ ఇండియా ఇంటర్ యూని వర్సిటీ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ 93 కేజీల విభాగంలో యూనివర్సిటీ తరపున గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. కాకినాడలో యూనివర్సిటీ స్పోర్ట్స్‌డే సెలబ్రేషన్స్‌లో భాగంగా ఖాజా వలికి 25వేల రూపాయల చెక్కును వైస్ ఛాన్స్‌లర్ చేతుల మీదుగా అందించడం జరిగిందన్నారు. కళాశాల మేనేజర్ ఆర్వి రమణమూర్తి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్విడి అనిల్ కుమార్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి సిహెచ్ హరికిషన్ పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన 700 ఆక్సిటోసిన్ ద్రావకం బాటిళ్లు సీజ్

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అడిషనల్ ఎస్పీ కొల్లి శ్రీని వాసరావుకి సెంట్రల్ గవర్నమెంట్ వారు నిషేధించిన ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల చట్టవిరుద్ధంగా అమ్మకం గురించి విశ్వసనీయ సమాచారం మేరకు ఒంగోలు పట్టణంలోని గోపాలనగర్‌లోని రావులకొల్లు శేషమ్మ ఇంటి వద్ద ఆక్సి టోసిన్ ద్రావణం కలిగిన 700 సీల్డ్ ప్లాస్టిక్ బాటి ళ్లను (పశువులకు ఉపయోగించుటకు) అక్రమంగా నిల్వ ఉంచబడి ఉండగా డ్రగ్ ఇన్స్పెక్టర్ వాటిని సీజ్ చేశారు. ఎనాలిసిస్ నిమిత్తం శాంపిల్స్ తీసి ల్యాబ్‌కుపంపి రిపోర్ట్ వచ్చిన ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకున్నారు న్నారు. విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వర రావు, డ్రగ్ఇన్స్పెక్టర్, వెటర్నరీఏడి.సిబ్బంది పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ఛైర్మన్‌గా శ్యామల కాశిరెడ్డి నియామకంపై హర్షం

విశాలాంధ్ర-పామూరు : వెలిగండ్ల మండలా నికి చెందిన టీడీపీ నాయకులు, వ్యాపార వేత్త, ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్యామల కాశి రెడ్డి నికనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి ఆశీస్సులతో డిసిఎంఎస్ చైర్మన్‌గా నియ మించడంపై పామూరు పట్టణ టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారంకాశిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువాతో సత్కరించి శుభా కాంక్షలు తెలియజేశారు. యూనిట్ ఇన్‌ఛార్జ్ ఉప్పల పాటి హరిబాబు, పట్టణ టిడిపి నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, మెంటా నరసింహారావు, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ నర్సింగ్ సాంబయ్య, బండ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వార్షికోత్సవం

విశాలాంధ్ర -చీమకుర్తి: ప్రతి సంవత్సరం మే 14 తేదీన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం కోనంనేనివారి పాలెంలో వార్షికోత్సవం వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ నిర్వహిస్తుంది. ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నిర్మించుట 1998వ సంవత్సరం శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బూచేపల్లి కుటుంబం, శిద్దా కుటుంబం, గ్రామ నాయకులు, పుట్ట వెంకటేశ్వర్లు, పారిశ్రామికవేత్తల కృషితో ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నిర్మాణం పూర్తయి 2001 మే 14న ప్రతిష్ట చేయడం జరిగింది. అప్పటినుండి ప్రతి ఏటా మే14 న వైభవంగా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో వార్షికోత్సవం తిరునాల నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా భక్తులతో పాటు ప్రముఖులు పాల్గొని పూజలు చేస్తారు ప్రత్యేక అలంకరణతో స్వామివారిని దర్శిస్తుంటారు గుడి పరిసర ప్రాంతాల్లో భక్తులు కనువిందు చేయుటకు ప్రతి సంవత్సరం తిరునాల నిర్వహిస్తుంటారు. ఈ సంవత్సరం విద్యుత్ ప్రభలు రెండు వైఎస్ఆర్సిపి,ఒకటి టిడిపి ఒకటి,సిపిఎం, జనసేన,పాట కచేరి ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభలపై సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేవస్థాన నిర్మాణంలో పుట్టా బ్రహ్మయ్య, జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు మండల వైసీపీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు తదితరులు కృషి ఉంది.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : శ్రీనివాస్

విశాలాంధ్ర-త్రిపురాంతకం : సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా మండల మహాసభలను జయప్రదం చేయాలనీ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. త్రిపు రాంతకం మండలంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 11 తేదీ సీపీఐ ప్రకాశం జిల్లా కార్యవర్గ సమా వేశంలో నిర్ణయించారు. అందులో సీపీఐ రాష్ట్ర మహా సభలు ప్రకాశం జిల్లా కేంద్రం అయిన ఒంగోలులో ఆగస్టు 20 నుండి 24 వరకు నిర్వహించాలని కమిటీ తీర్మానం చేయడం జరిగిందన్నారు. అందుకుగాను అన్ని గ్రామాలలో శాఖ మహాసభలు, మండలంలో మండల మహా సభలు, జిల్లా మహాసభలు ఏర్పాటు చేసి కమిటీలు ఏర్పాటు చేయా లనీ కోరారు. డిసెంబర్ నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతజయంతి ఉత్సవాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలలో ప్రజ లకు, పార్టీ క్యాడర్‌కు పార్టీచేసిన త్యాగాలు,పార్టీ కోసం అసువులు బాసిన నాయకులు వారు చేసిన త్యాగాలను వివరించి, పార్టీ విశిష్టత తెలియజేయాలని కోరారు. ఈనెల 18న దొర్నాల మండల మహాసభ, 21న త్రిపురాంతకం మండల మహాసభ, మిగిలిన మండల మహా సభలు నిర్వహి ంచడం జరుగుతుందన్నారు. జూన్ 5న యర్రగొండపాలెం నియోజకవర్గ మహాసభ ఏర్పాటు చేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ జిల్లా ఇన్‌ఛార్జ్ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా పాల్గొనడం జరుగుతుందన్నారు. జూన్ 21న దర్శిలో జిల్లా మహాసభ లను జయప్రదన్ చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా మహా సభల అనంతరం జరుగు రాష్ట్ర మహా సభలకు డెలిగేట్స్ ఎన్నిక చేసుకొని రాష్ట్ర మహాసభలో జరుగు భారీ ర్యాలీ, మహా సభను జయప్రదం చేయడానికి నియోజక వర్గం నుండి నాయకులను, కార్యకర్తలను తరలించి జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మల్లికార్జున,పట్టణ కార్యదర్శి కాశీం, మండల కౌన్సిల్ మెంబర్ నయీమ్ బేగ్,దొర్నాల కార్యదర్శి విశ్వరూపాచారి, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలి

విశాలాంధ్ర-ఒంగోలు : టిడ్కో గృహా లను పూర్తిచేసి పేద మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలని ఒంగోలు అసెంబ్లీ నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ అన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఒంగోలు నగరంలో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల గృహాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు సంయుక్తంగా నిర్మించ తలపెట్టిన టిడ్కో గృహాలు 6000 మంది లబ్ధిదారుల కొరకు స్థల సేకరణ జరిగి, నిర్మాణం మొదలుపెట్టి దాదాపు పూర్తికావచ్చిన, ఎన్నికల నెపంతో ఆనాడు టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించకుండా ఎన్నికలకు వెళ్లిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గృహ నిర్మాణాలను నత్త నడకన కొనసాగి ంచిందని, మరల అధికారంలోకి వచ్చిన వచ్చిన టిడిపి ప్రభుత్వం అధికారం వచ్చి సంవత్సరం గడుస్తున్న ఇంతవరకు టిడ్కో ఇళ్లను పూర్తి చేసి అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫల మైందని, రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక సభల్లో మాట్లాడుతూ జూన్ నెల 12న ఆరు జిల్లాల్లో టిడ్కో గృహాల గృహ ప్రవేశాలకు ప్రణాళికలో సిద్ధం చేస్తున్నా మని చెబుతున్నప్పటికీ వాటిలో ఒంగోలు పేరు లేకపోవడం సోచనీయమని అన్నారు.

మహిళా ఉజ్వల్ భవిష్యత్తుకు కిశోరి వికాసం

ఎంపీడీవో ప్రభాకర్ శర్మ

విశాలాంధ్ర-పీసీపల్లి : బాలికలు మహిళల ఉజ్వల్ భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో గానో దోహదపడుతుందని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ పేర్కొన్నారు. మండలంలో అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్న కిశోరి వికాసం సంబంధించి అంగన్వాడీ టీచర్స్ మహిళా పోలీసులకు మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ప్రభాకర్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లల ఉజ్వలమైన ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం పున:ప్రారంభం పునాది వేస్తుంద న్నారు. బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించాలని తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఐ శ్రీలక్ష్మి అంగన్వాడి సూపర్వైజర్ జరీనా డిప్యూటీ ఎంపీ డీవో రాంప్రసాద్ అంగన్వాడీ టీచర్లు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నాటు సారా రహిత ఏపీగా తీర్చి దిద్దాలి

విశాలాంధ్ర-సీఎస్ పురం : నాటు సారా రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కనిగిరి డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్ ఆధ్వర్యంలో సీఎస్‌పురం ఎస్సై సుమన్, సిబ్బంది కనిగిరి ఎక్సైజ్ వారు కలిసి నాటు సారా బట్టీల పైన డ్రోన్ల సహాయంతో వాటిని గుర్తించి మైలుచర్ల గ్రామంలో జాయింట్ ఆపరేషన్ చేసి, మైలుచర్ల గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించి, నాటు సారవలన వచ్చే నష్టాల గురించి పూర్తిగా వివరించి ఇకపై ఎవరు నాటు సారా కాయవద్దని, కాస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకి పూర్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ట్రాక్టర్ దొంగతనంపై కేసు నమోదు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలంలోని ముటుకుల, కొండారెడ్డి కోస్టల్ గ్రామాల్లో పెట్టిన ట్రాక్టర్, రోటావేటర్, ట్రాక్టర్ ట్రాలీలను గుర్తుతెలియని దొంగలు తీసుకునివెళ్ళారు. బి.శంకరరావు, వి.వాగ్యానాయక్ ఫిర్యాదు మేరకు పుల్లలచెరువు ఎస్సై సంపత్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. దొంగిలించిన సొత్తు విలువ సుమారు 9 లక్షలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

విజేతగా రాజానగరం, అద్దంకి, మారెళ్ళ జట్లు

విశాలాంధ్ర-ముండ్ల మూరు : మండల కేంద్రమైన ముండ్ల మూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో చివరి రోజు రసవత్తరంగా సాగాయి. నిర్వాహకులు టిడిపి యువ నాయకులు బేత పూడి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు విజయవంతంగా ముగిశాయి. చివరి రోజు జరిగిన ఫైనల్ పోటీలలో మొదటి మ్యాచ్లో గంగన్న పాలెం, రాజానగరం జట్టు తలపడగా రాజానగరం జట్టు విజేతగా నిలిచింది, రెండో మ్యాచ్లో మెగా ప్రిన్స్, అద్దంకి జట్టు తలపడగా అద్దంకి జట్టు విజేతగా నిలిచింది, మూడో మ్యాచ్లో తుమ్మెదల పాడు, మారెళ్ళ జట్టు తలపడగా మారెళ్ళ విజే తగా నిలిచింది. మొదటి బహుమతి బేతపూడి రామారావు, రావూరి దుర్గాప్రసాద్ 25000, రెండవ బహుమతి ముండ్లమూరు మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకట్రావు, మేదరమెట్ల అచ్చయ్య 15116 రూపాయలు, బహుమతి ఆనెం నాగేశ్వ రరావు 10116లు విజేతలకు అందజేశారు. కార్యక్రమ ంలో రావూరి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేరస్థుల పై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర -కొండపి : పోలీస్ సిబ్బందికి నేరస్తులపై అప్రమత్తంగా ఉండాలని కనిగిరి ఎస్డీపీఓ సాయి ఈశ్వర్ యశ్వంత్ సూచించారు. కొండపి సర్కిల్ కార్యాలయంలో మంగళవారం కనిగిరి ఎస్డీపీఓ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. పోలీస్ సిబ్బందికి ఎస్డీపీఓ పలు సూచనలు చేశారు. నేరస్థులపై అప్రమత్తంగా ఉండాలని అసాంఘిక కార్యక లాపాలకు చోటు లేకుండా చూడాలన్నారు. కొండపి సీఐ సోమశేఖర్ ఎస్సై ప్రేమ్ కుమార్‌తో పాటు పామూరు కొండపి కనిగిరి సర్కిల్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శిద్ధా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -చీమకుర్తి: చీమకుర్తి కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ప్రముఖ పారిశ్రామిక వేత్త శిద్దా వెంక టేశ్వరరావు పుట్టినరోజు వేడుకలను పలు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక కృష్ణ సాయి గ్రానైట్స్ కంపెనీ ఆవర ణలో కార్మికుల మధ్య ఏర్పాటు చేసిన టువంటి ఆయన తల్లి శిద్దా హైమావతి సతీమణి సిద్ద సూర్య కుమారి సిద్ద అశీసులతో కలిసి భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జి జి హెచ్ ఎస్ వైద్యులు మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తం శిబిరాన్ని వెంకటే శ్వరావు ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. రోడ్డు పక్కన కార్మికులకు పాదచారులకు దాహార్తి కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులకు కార్మికులకు బోనస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధి రామచంద్రారెడ్డి, ఆర్. రాజా,రాంబాబు,టీ.వీ. మురళీ మనోహరావు, సురేష్ సంతనూతల పాడు మాజీ సర్పంచ్ అంకమరావు, ఆర్. యోగయ్య పాల్గొన్నారు.

ఎంపీడీవోగా విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-సంత నూతలపాడు : సంతనూతలపాడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఎంపీడీవోగా పదోన్నత పొందిన ఈదర విజయలక్ష్మిని మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు అభినందన కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో సురేష్ బాబు పలువురు సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఏడు నెలలపాటు విజయలక్ష్మి సంత నూతల పాడులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేశారు. పదోన్నతపై పోదిలి ఎంపీడీవోగా విజయలక్ష్మి బదిలీ అయ్యారు. ఎంపీ డీవో విజయ లక్ష్మి మే 31న పదవి విరమణ కానున్నారు.

నేడు సీపీఐ విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర-సంత మాగులూరు : సీపీఐ పార్టీ అద్దంకి నియోజకవర్గ విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం బుధవారం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ సంత మాగులూరు మండల సమితి అధ్యక్ష, సహాయ కార్య దర్శులు మల్లెల ఏసోబు, షేక్. ఖాదర్ బాషా మంగళవారం తెలిపారు. అద్దంకి పట్టణంలో ఉన్న భూపేష్ భవనంలోని పార్టీ ఆఫీసు నందు ఉదయం 10 గం.కు సమావేశం మొదల వుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బాపట్ల జిల్లా కార్య దర్శి తన్నీరు సింగరకొండ అతిథిగా హాజరవుతారని తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, గ్రామ శాఖ కార్యదర్శులతో పాటు సీనియర్ నాయకులు అందరూ తప్పని సరిగా పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సమావేశా నికి వచ్చేవారు విధిగా సభ్యత్వ ఫారం-1,2 వెంట తీసుకురావాలని కోరారు.

పథకాల సత్వర అమలుకై, ఇకనైనా వలంటీర్లను విధుల్లోకి తీసుకోండి

విశాలాంధ్ర-వేటపాలెం : కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవు తున్న పథకాల అమలు శూన్యమని రాష్ట్ర వాలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు షేక్ హుమాయన్ భాష అన్నారు. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ ,తల్లికి వందనం పథకాల తాలూకు సంక్షేమ పథకాల మొత్తాన్ని త్వరలోనే లబ్ధి లబ్ధిదారుల ఖాతాలో వేస్తానని ప్రకటించిందని,ఇది స్వాగతించదగినదే ఐనప్పటికీ లబ్ధిదారులకు కష్టాలు ఇప్పుడే మొదలయ్యాయని వలంటీర్ల సంఘం నిరసన వ్యక్తం చేసింది. గతంలో ఒక్క ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం బ్యాంకుల చుట్టూ గ్యాస్ కంపెనీల చుట్టూ మహిళలు తిరగటం చూసాం. ఇప్పుడు రేషన్ కార్డులు, పట్టాదారుపాస్ పుస్తకాలు తీసుకుని తాజా వివరాలను నమోదు చేయించుకోవడం కోసం సచివాలయాల చుట్టూ ఈ మండు టెండల్లో తిరగాల్సిన పరిస్థితి వచ్చిందిన్నారు. నాటి జగన్ ప్రభుత్వంలో ఈ పనులన్నీ వాలంటీర్లు చేసేవారని, ఇప్పుడు వాల్ ఇంటర్లు లేకపోవడం వలన ప్రజలు తిప్పలు తప్పడం లేదన్నారు. గతం కంటే ఎక్కువ పథకాలను ఆశ చూపి ఎన్నికలలో గెలుపొందిన కూటమి అగ్రనేత ఇంతవరకు బటన్ నొక్కిందిలేదు.అదొకపనా, మూల నున్న ముసలమ్మెనా చేయగలదు అని ఎగతాళి చేసిన ముఖ్యమంత్రి ఇప్పుడు పొరపాట్లు- పక్షపాతం, అవినీతి - ఆలస్యం ఏమీ లేకుండా ఈ బటన్ నొక్కే పని జయప్రదంగా చేయగలడా అనేది అనుమానా స్పదమేన్నారు.ఇకనైనా జ్ఞానోదయం తెచ్చుకుని ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సూర్య ఘర్ యోజన్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో విద్యుత్, డి.ఆర్.డి.ఎ, సోలార్ కంపెనీ డీలర్లుతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన్ పథకం క్రింద ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన్ పథకం క్రింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే బ్యాంక్ రుణాలను మంజూరు చేయాలని ఆయన చెప్పారు.సోలార్ కంపెనీలు వారికి కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపట్టాలని చెప్పారు. డిస్కమ్ అధికారులు సోలార్ కంపెనీ ప్రతి నిధులను ఇబ్బంది పెట్టవద్దని ఆయన చెప్పారు. సోలార్ డీలర్ల ను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ట్రాన్స్ కో ఎస్.ఇ శ్రీనివాసరావు,సోలార్ కంపెనీ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-చెరుకుపల్లి : కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 20న జరు గుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయ వంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా సమితి నాయకులు బండారు శ్రీనివాసరావు, ఎఐఎఫ్టీయు న్యూ నాయకులు మర్రివాడ వెంకట్రావులు పిలుపు నిచ్చారు. మంగళవారం చెరుకుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా మార్చాలన్న మోడీ విధా నాలను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే ఇప్పుడు ఉన్న అనేక హక్కులను కార్మికులు ఉద్యోగులు కోల్పో వాల్సి ఉంటుందని వెంకట్రావు, శ్రీనివాసరావులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు లాబాలను చేకూర్చేందుకే కేంద్ర ప్రభుత్వం దొడ్డి దారిన లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందన్నారు. ఈ కోడ్‌లు వలన పనిగంటల భారం పెరగడంతో పాటు సమస్యల పరిష్కారం కోసం పోరాడే హక్కు కార్మికులకు లేకుండా పోతుందన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు అమలుచేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, తదితర డిమాండ్ల సాధన కోసం జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, కార్మిక సంఘాల నాయ కులు కె. వెంకటరమణ, కె. శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : లే అవుట్ల క్రమబద్ధీకర ణలో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. మంగళవారం, స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో బాపట్ల మున్సిపాలిటి బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్‌లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ఆరా తీశారు.2019 నుండి మున్సిపాలిటీ, బావుడా పరిధిలోని తొమ్మిది మండలాలలో మొత్తం 183 అనధికార లేఅవుట్లను గుర్తించి వాటి వివరాలను డిటిసిపికి పంపటమైనదని అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అందులో 86 లేఅవుట్లను 22ఎ కింద గుర్తించి రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌కు పంపామని మిగిలిన 97 లేఅవుట్లను సబ్ డివిజన్లుగా చేసి పంపాలని వాటిని తిప్పి పంపారని వారు కలెక్టర్ కు వివరించారు. 97 లే అవుట్లకు సంబంధించి సర్వే నెంబర్లు వారీగా ఆయా తాసిల్దార్లతో సబ్ డివిజన్ చేయించి వాటి వివరాలను బావుడాకు తెలియజేయాలని రెవెన్యూ డివిజన్ అధికారులను ఆయన ఆదేశించారు. అనధికారిక 183 లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబ ంధించి సానుకూలంగా, సలహాలతో డిటిసిపికి అనుమతుల కొరకు లేఖ రాయాలని ఆయన బావుడా అధికారులను సూచించారు. కొత్త లే అవుట్ల అనుమతులకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని సూచి ంచారు. Dtcp.ap.gov.in,portel.apdms. gov. in ద్వారా జిల్లాలో అప్రూవ్డ్ లేఅవుట్ల వివరాలను తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు ప్రకారం వేసుకోవాలని ఆయన లేఅవుట్ల యజమా నులకు సూచించారు. నిబంధనల మేరకు లే అవుట్లు వేసుకునే వారికి ప్రభుత్వం నుండి ఎటు వంటి ఆటంకం ఉండదని, వారు నిస్సందేహంగా వ్యాపారం చేసుకోవచ్చ న్నారు. జిల్లాలో పంచాయతీ సెక్రటరీలు 167 ఏ క్రింద అడ్డగోలుగా అవకత ్వకలకు పాల్పడుతూ లేఅవుట్లకు అనుమతులు ఇస్తున్నారని పేపర్లో వార్తలు వస్తున్నాయి అని తెలిపారు. కార్యక్రమంలో డిపిఓ ప్రభాకర్, బాపట్ల, చీరాల,రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, చంద్రశేఖర్, రామ లక్ష్మి, బాపట్ల, రేపల్లె, అద్దంకి, చీరాల మున్సిపల్ కమిషనర్లు,బావుడా ప్లానింగ్ అధికారి షేక్ ఖలీషా, లైసెన్స్ టెక్నికల్ ఇంజనీర్లు, పాల్గొన్నారు.

ఇచ్చిన విరాళం పైసాతో సహా లెక్క చెప్పాల్సిందే

- దాతలు విరాళాలు బంగారు బిస్కెట్లు, వెండి ఎక్కడ....?
- ప్రాచీన గాలిగోపురం మీద ఉన్న కలశాలు ఎక్కడ..?
- ధ్వజస్తంభారోహణ కోసం, గర్భగుడి తవ్విన సమయంలో వీడియోలు ఎందుకు తీయలేదు
- రాష్ట్రపతికి ఫిర్యాదు చేయగా విచారణ జరగకుండా అడ్డుకుంటున్న అదృశ్య శక్తి ఎవరు..?
- మీడియా సమావేశంలో న్యాయవాది విన్నకోట సత్యప్రసాద్

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : భావ న్నారాయణ స్వామికి భక్తులు, దాతలు ఇచ్చిన ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సిందే అని ప్రముఖ న్యాయ వాది విన్నకోట సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం మీడియా సమావేశంలో విన్నకోట మాట్లా డుతూ స్వామి వారికి భక్తులు దాతలు విరివిగా విరాళాలు, బంగారు బిస్కెట్లు, వెండి ఇచ్చారని వాటిని ఎక్కడ ఉంచారని భావన్నారాయణ స్వామి కమిటీ సభ్యులను మాజీ శాసన సభ్యులు కోన రఘుపతిని న్యాయవాది విన్నకోట సత్యప్రసాద్ సూటిగా ప్రశ్నించ్చారు. గత 10 సంవత్సరాల నుంచి భావనారాయణ స్వామి వారి జీర్ణోద్ధరణ విరాళముల బహిర్గతం చేయాలన్నారు.స్వామి వారి పూజా కార్యక్రమానికి వెళ్లిన క్రమంలో ఆలయ ఈఓను భావపురి శ్రీ మత్సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ క్షీర భావనారాయణ స్వామి వారి జీర్ణోద్ధరణ విరాళముల వివరాలను దాతలకు, భక్తులకు బహిరంగంగా తెలియపరచాలని కోరానన్నారు. దీనికి మాజీ శాసన సభ్యులు కోనా రఘుపతి పొంతన లేని సమాధానం ఇవ్వడం సరిగా లేదన్నారు.ఈఓ సమాధానం సరిగా లేదని విరాళాలు వసూలు ప్రవేట్ కమిటీ వారు విరాళాలు వసూలు చేశారు వారిని అడగండి అని ఈఓ సమాదానం చెప్పడం ఆశ్చర్యనికి గురి చేసిందన్నారు.నేను స్వామి వారి కి ఒక భక్తుడి గా, ఆలయం విరాళా దాతగా, పౌరుడిగా, న్యాయవాదిగా వివరాలు అడిగి తెలుసుకునే భాధ్యత ఉందన్నారు. కోన శాసన సభ్యులుగా ఉన్న సమయంలో జిల్లా సాధన కోసం బాపట్ల పట్టణంలో ఎన్‌జిఓ హోమ్‌లో న్యాయవాదులతో మీటింగ్ పెట్టి జిల్లా మనకి వస్తే జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతు ందని ఆ సమయంలో జిల్లా సాధన కోసం సపోర్ట్ చేసిన మాటను గుర్తు చేశారు.నేను ఎవరి మెప్పు కోసం భావదేవుడి విరాళాలు వివ రాలు కోరలేదు.. నావెనుక ఎవరు లేరు.. నేను లెటర్ వ్రాసిన విషయం భావదేవుడుకి నాకు తప్ప ఎవరికీ తెలియదన్నారు.గతంలో ఉన్న బావ దేవుని ఆలయ కమిటీ ఛైర్మన్ చని పోయి 14 నెలలు అవుతుందన్నారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ అధినేత స్వామివారికి గోల్డ్ బిస్కెట్స్ వెండి ఇచ్చానన్నారు. ఈ విధంగా స్వామి వారికి అనేకమంది భక్తులు దాతలు విరాళాలు ఇస్తుంటే ఇవన్నీ ఏమవు తున్నాయని ఈవోని ప్రశ్నించగా ఆయన మాకు సంబంధం లేదు ఆ విరాళాల సంగతి ప్రైవేటు కమిటీ వారు చూసుకుంటున్నారు అని ఆ ప్రైవేట్ కమిటీలో ఉన్న సభ్యులు, మాజీ శాసనసభ్యులు వివరాలు ఇవ్వాలన్నారు. ఆలయ విరాళాలు బాధ్యత ఆలయ అర్చకులు, ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ వారిది, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ వారిది ప్రైవేట్ కమిటీ వ్యక్తులకు సంబంధం ఏమిటి అసలు అని ప్రశ్నించారు.రూ. 10 వేలు ఇస్తే శిలాఫలకం మీద పేరు వేస్తాము అని స్వయంగా ఛైర్మన్ తెలిపారని అది నేటికీ అమలు కాలేదన్నారు.కోన రఘుపతి ఒక విజ్ఞత కలిగిన వ్యక్తిగా స్వామి వారికి వచ్చిన విరాళాలు ఎండోమెంట్ అధికారులకి వారికి అందజేయాలని భక్తులు మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదన్నారు. రామానుజ కూటమికి సంబంధించి బాట సారులు సేద తీర్చుకోవడానికి ఇచ్చా రని కానీ దానిని కూడా గుడికి సంబంధించిన వాటిలో కలిపి కమిటీ వారే చూసుకుంటున్నారని లాడ్జిలు కట్టి బ్యాంకుల వాళ్లకి అద్దెలకు ఇచ్చి వాటి నుంచి వస్తున్న ఆదాయ లెక్కలు ఏమైనట్లు అని ప్రశ్నించారు. బావ దేవుని ఆలయంలో ఉన్న కమిటీ వ్యవస్థ అనే దాన్ని పూర్తిగా తీసివేసి డబ్బులు వసూలు చేయడం ఆపి వేయాలని ఆలయానికి సంబం ధించిన విరాళాలు వివరాలు బహి రంగంగా తెలియపరచాలని లేకుంటే ముమ్ముందు చట్టం పరిధిలో వెనకడుగు వేయక భక్తుల కోసం స్వామి వారికి ఇచ్చిన విరాళాలు ఆదాయాలపై పోరాటం చేస్తానని విన్నకోట సత్యప్రసాద్ తెలిపారు.